సాక్షి మంచిర్యాల

శనివారం । 29 । జూలై । 2023



గోదావరి సందర్శన నిలిపివేత

మంచిర్యాలక్రైం: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలీసులు సందర్శనను నిలిపివేశారు. డీసీపీ సుధీర్ రాంనాథ్, సీఐలు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను సందర్శించారు.

మంచిర్యాల ఆర్డీవోగా రాములు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల ఆర్డీవోగా వీ.రాములు, బెల్లంపల్లి ఆర్డీవోగా డి.కొమురయ్య నియామకం అయ్యారు. ఇటీవల మంచిర్యాలకు శకుంతలను ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ కాగా.. తాజాగా మార్పులు చేశారు. వీరంతా ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతులు పొందారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

గరిష్టం/కనిష్టం

29.0 /25.0

వాతావరణం

ఆకాశం ఉదయం పాక్షికంగా, సాయంత్రం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

పర్యాటక ప్రాంతాల సందర్శన నిషేధం

మంచిర్యాలక్రైం: భారీ వర్షాలకు ప్రాజెక్టులు, డ్యామ్‌లు, చెరువులు, వాగులు, జలపాతాలు నిండుకుండలా ఉన్నాయని, రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని జలపాతాలు, పర్యాటక ప్రాంతాలు ప్రమాదకరంగా ఉన్నందున సందర్శన పూర్తిగా నిషేధించామని పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టడం, వరుసగా రెండ్రోజులు సెలవులు రావడంతో ప్రజలు, యువత ఎక్కువ శాతం జలపాతాల సందర్శనకు వెళ్లే అవకాశం ఉన్నందున ముందస్తుగా హెచ్చరిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రహదారులు మూసి వేశామని పేర్కొన్నారు. పర్యాటకులు ఒక్క రోజు ఆనందం కోసం విషాదం కొని తెచ్చుకోవద్దని, పోలీస్‌లకు సహకరించాలని కోరారు.

శిబిరాల్లోనే వరద బాధితులు



ఆశ్రయం పొందుతున్న బాధితులు

మంచిర్యాలటౌన్: వర్షాకాలం వచ్చిందంటే భయం గుప్పిట్లోనే మంచిర్యాల పట్టణ లోతట్టు ప్రాంత ప్రజలు గడపాల్సి వస్తోంది. గత మూడు రోజులుగా వరద వస్తుందనే భయంతో ఉన్న ముంపు బాధితులను గురువారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం, వైశ్య భవనం, ఆర్‌బీహెచ్‌వీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాలకు తరలించారు. గురువారం రాత్రే రాంనగర్, ఎల్‌ఐసీ కాలనీ, పద్మశాలి కాలనీలోని ఇళ్లు వరద నీటిలో మునిగి పోయాయి. వరద బాధితులకు ఆయా శిబిరాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలను అందిస్తుండగా, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా వరదల్లో తమ ఇళ్లు మునిగిపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, వరదలు రాకుండా పూర్తిస్థాయి చర్యలను తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. వరద బాధితుల శిబిరాలు, వరద ముంపు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, తహసీల్దార్ రాజేశ్వర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.

జర్నలిస్టుల హామీలు అమలు చేయాలి



కార్డులు పోస్టు చేస్తున్న జర్నలిస్టులు

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, పింగలి సంపత్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని స్వయంగా సీఎం హామీనిచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా అమలుకు నోచుకోలేదని తెలిపారు. హెల్త్‌కార్డులు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చెల్లుబాటయ్యే విధంగా ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు కాచం సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, ఉదయ్‌కుమార్, ఆకుల రాజు, జనార్దన్, రాజేశ్వర్, దేవరాజు పాల్గొన్నారు.

వంతెనలను పరిశీలించిన ఎమ్మెల్యే చిన్నయ్య



ఎర్రవాగు వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నెన్నెల: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శిథిలమైన లంబాడితండా ఎర్రవాగు, గుండ్లసోమారం పెద్దవాగు వంతెనలను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతుల కోసం ఎర్రవాగు కల్వర్టుకు రూ.5 లక్షలు, గుండ్లసోమారం వంతెనకు రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎర్రవాగు వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేశామని, టెండర్ ప్రక్రియలో ఉందని తెలిపారు. కోణంపేట బీటీ రోడ్డుకు రూ.5 కోట్లు మంజూరు చేసినా అటవీ శాఖ అనుమతులు రాక ఆలస్యం అవుతున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, నాయకులు రాంచందర్ పాల్గొన్నారు.



మంచిర్యాల రాంనగర్ కాలనీ వరకు చేరిన వరద



ఎన్టీఆర్‌నగర్‌లోకి చేరిన రాళ్లవాగు బ్యాక్‌వాటర్



ఎన్టీఆర్ నగర్‌లో వరద భయంతో ఇళ్లకు తాళం



ఎంసీహెచ్ సమీపంలో గోదావరి ఒడ్డు వరకు వరద నీరు

వరదలతో విల విల!

- గోదావరి నది ఉగ్రరూపంతో ముంపు
- జిల్లా కేంద్రంలో పలు కాలనీలకు నీరు
- ఇళ్లు, పంటలు నీట మునగడంతో నష్టం
- వర్షం ఆగడంతో తప్పిన పెను ముప్పు



జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ఇళ్ల మధ్యలోకి చేరిన వరద నీరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వరదలతో జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు విలవిలలాడారు. గురువారం రాత్రి నుంచే వరద ఉధృతి పెరగడంతో ముంపు ప్రాంత ప్రజలు అవస్థలు పడ్డారు. ఇళ్లకు తాళాలు వేసి కొందరు తమకు తెలిసిన వారి ఇళ్లకు వెళ్లగా.. మరికొందరు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఇళ్లలోని సామగ్రి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక కొందరు రెండు, మూడో అంతస్తులో సామాన్లు భద్రపర్చుకున్నారు. వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. డ్రెయినేజీలు పొంగడంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీళ్లు చేరాయి. గోదావరి తీరంలో ఉన్న మాతాశిశు సంరక్షణ కేంద్రం నీట మునిగింది. జిల్లా కేంద్రంలోని పలు కాలనీలను వరద చుట్టుముట్టింది. జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రత్యేక అధికారి భారతి హోళ్లికేరి, కలెక్టర్ బాదావత్ సంతోష్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, విపత్తు నిర్వహణ అధికారులు ఎప్పటికప్పుడు పర్యటిస్తూ చర్యలు చేపట్టారు. మండలాల్లో స్థానిక పోలీసులు, తహసీల్దార్లు, పంచాయతీ సిబ్బంది, సాగునీటి, విద్యుత్, విపత్తు నిర్వహణ అధికారులు ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టారు.

ఉప్పొంగిన గోదారమ్మ

వరుసగా కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. తీర ప్రాంతంలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, నస్పూర్, చెన్నూరు పట్టణాలను వరద ముంచెత్తింది. ఎగువన గోదావరి నదిపై ఉన్న శ్రీరాంపూర్ సాగర్ ప్రాజెక్టు, కడెం గేట్లు ఎత్తడంతో నదిలోకి భారీగా వరద నీరు చేరింది. 20టీఎంసీల సామర్థ్యం ఉన్న ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో నీరు ఉరకలెత్తుతోంది. మందమర్రి మండలం అందుగులపేట శివారు అటవీ ప్రాంతంలో పుట్టి తిమ్మాపూర్, బొక్కలగుట్ట, గద్దెరాగిడి, జిల్లా కేంద్రం గుండా ప్రవహించి గోదావరి నదిలో కలిసే రాళ్లవాగు బ్యాక్ వాటర్‌తో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రం మంచిర్యాలలోని లోతట్టులో ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, ఎల్‌ఐసీ కాలనీ, సాయికుంట, ఆదిత్య ఎన్‌క్లేవ్, రెడ్డికాలనీ, బైపాస్ రోడ్డు, రాళ్లపేట్, పాత మంచిర్యాలతోపాటు పలు కాలనీలకు వరద ముంపు ఏర్పడింది. నస్పూర్ పట్టణం తోళ్ల వాగుతో వరదలు వచ్చాయి. చెన్నూరు పట్టణం, జన్నారం మండలం రోటిగూడ, తిమ్మాపూర్ గ్రామాలు, దండేపల్లి మండలం, జైపూర్ మండలం వేలాల, పౌనూరు, శివ్వారం గ్రామాల్లో ముంపు ప్రాంత ప్రజలను ముందస్తుగానే అధికారులు అప్రమత్తం చేశారు.

పంటలకు దెబ్బ

గత మూడేళ్లుగా జిల్లాలో ప్రాణహిత, గోదావరి నదీ తీర ప్రాంత పంటలు నీట మునిగి తీరని నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది సైతం వరదలతో పంటలోకి నీరు చేరాయి. ఈసారి నీరు ఎక్కువ రోజులు చేలల్లో లేకపోవడంతో తీవ్రత తక్కువగా ఉంటుందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో అధికారికంగా ఎక్కడా పంట నష్టం జరగలేదని చెబుతున్నారు. రైతులు మాత్రం తమ పంట నీట మునిగిందని ఆవేదన చెందుతున్నారు. చెన్నూరు, కోటపల్లి తీర ప్రాంత పత్తి చేన్లలోకి నీరు చేరింది.

సాయంత్రం వరకు తగ్గుముఖం

శుక్రవారం ఉదయం వరకు ఉధృతంగా ప్రవహించిన వాగులు, నదులు క్రమంగా సాయంత్రం వరకు తగ్గుముఖం పట్టాయి. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వర్షం ఉదయం నుంచే లేకపోవడంతో ముప్పు తప్పినట్లయింది. లేకపోతే మరింతగా జిల్లాలో నష్టం వాటిల్లే అవకాశం ఉండేది.

జిల్లాలో 13.4 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు 13.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కాసిపేట మండలంలో 56.4 మిల్లీమీటర్లు, జన్నారంలో 33.2, దండేపల్లిలో 28.4, హాజీపూర్‌లో 20, కోటపల్లిలో 14.2, భీమినిలో 10.8, లక్సెట్టిపేటలో 9.6, కన్నెపెల్లిలో 6.8, తాండూర్‌లో 2.1, వేమనపల్లిలో 2.7, బెల్లంపల్లిలో 2.3, మందమర్రిలో 10.7, మంచిర్యాలలో 9.9, నస్పూర్‌లో 7.9, జైపూర్‌లో 4.3, భీమారంలో 5.1, చెన్నూర్‌లో 13.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 447.6 మిల్లీమీటర్లు కాగా 626.3 మిల్లీమీటర్లు కురిసింది. 40 శాతం అధికంగా నమోదైంది.

అప్పుడు కలెక్టర్.. ఇప్పుడు ప్రత్యేకాధికారి..



గతేడు వరదల సమయంలో..

గత వానాకాలంలో అధిక వర్షాలు కురిసి, వరదలు వచ్చినప్పుడు కలెక్టర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి, భారతిహోళ్లికేరి, ప్రస్తుతం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రెటరీగా పని చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వరదల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా వచ్చారు. గత రెండు రోజులుగా జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ, ఇక్కడి యంత్రాంగానికి సూచనలు ఇస్తున్నారు.



ప్రస్తుతం...

మూడో ఏడాదీ వరద నీటిలో ఎంసీహెచ్



మాతాశిశు ఆరోగ్య కేంద్రం వద్దకు చేరిన నీరు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి నది సమీపంలో ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)ను మూడో ఏడాదీ వరద నీరు చుట్టుముట్టింది. మూడేళ్ల క్రితం ప్రారంభానికి ముందే నీటిలో మునిగిపోగా, గత ఏడాది నుంచి వైద్య సేవలు ప్రారంభించారు. గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు మునిగింది. బాలింతలు, గర్భిణులను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఏడాది జనవరిలో పునఃప్రారంభించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ నెల 21న ఎంసీహెచ్ నుంచి బాలింతలు, గర్భిణులు, చిన్నారులను ముందస్తుగానే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వరద వచ్చినా ఎలాంటి నష్టం లేకపోయినా మరోసారి వరద నీటిలో చిక్కుకోవడంతో ప్రతియేటా ముప్పు తప్పేలా లేదు. రూ.17.80 కోట్లతో నిర్మించిన ఈ ఎంసీహెచ్ ప్రతియేటా వర్షాకాలంలో మూసేయడం, ఆ తర్వాత అందులో వైద్య సేవలు కొనసాగించడం వల్ల బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరి నదికి సమీపంలో ఉండడం వల్ల వర్షాలు భారీగా కురిస్తే వరద ముప్పు తప్పదని, మరోచోట ఎంసీహెచ్‌ను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

నిండిన చెరువులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో వరుసగా కురిసిన వర్షాలకు చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా చేరుతోంది. బెల్లంపల్లి సాగునీటి పారుదల సర్కిల్‌లో ఉన్న మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని 840 చెరువులకు గాను 733 చెరువులు మత్తడి దూకాయి. జైపూర్ మండలంలో రెండు చెరువులు మాత్రమే 25శాతం నీటితో ఉన్నాయి. కాగా, జిల్లాలోని మధ్యతరహా నీటి ప్రాజెక్టులు ఇంకా నిండాల్సి ఉంది.



చెరువులు	నిండినవి	75శాతంపైన	25శాతం	
840	733	105	02	
ప్రాజెక్టు	సామర్థ్యం	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ర్యాలీవాగు	0.408	0.202	630	00
గొల్లవాగు	0.5675	0.179	223	00
నీల్వాయి	0.846	0.5	243	00

(సామర్థ్యం, ప్రస్తుతం నిల్వ టీఎంసీల్లో, ఇన్‌ఫ్లో, అవుట్ క్యూసెక్కుల్లో)

సహాయం అందించేందుకు సిద్ధం

- ప్రత్యేక అధికారి భారతి హోళ్లికేరి
- వరద ముంపు ప్రాంతాల పరిశీలన



వరద తీవ్రతను పరిశీలిస్తున్న భారతి, సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజలకు సహాయం అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి భారతిహోళ్లికేరి అన్నారు. శుక్రవారం కలెక్టర్ బి.సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమితో కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టాన్ని, జిల్లా కేంద్రంలోని రాంనగర్, ఎన్టీఆర్‌నగర్, నస్పూర్‌లో చేరిన వరద తీవ్రత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి భారతి హోళ్లికేరి మాట్లాడుతూ రాబోయే రెండ్రోజులు వర్ష సూచన ఉన్నందున అత్యవసర స్థితి నెలకొనే అవకాశం ఉందని, అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మున్సిపాల్టీలు, పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా తాగునీరు, తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై వివరించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణ కోసం జిల్లాలో 12 పునరావాస కేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల సహాయార్థం సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నం.08736 25051, 79016 28369 ఏర్పాటు చేశామని తెలిపారు. డీసీపీ, ఏసీపీలకు ప్రాజెక్ట్ వివరాలను రామగుండం రీజియన్ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ చీఫ్(ఈఎన్‌సీ) నల్ల వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఈఈ విష్ణుప్రసాద్, డెప్యూటీ ఈఎన్‌సీ దస్తగిరి, డీఈఈ కీర్తి, ఏఈఈ స్నిగ్ధ, సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

చెన్నూర్/కోటపల్లి: భారీ వర్షాల కారణంగా జిల్లా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళ్లికేరి అన్నారు. శుక్రవారం చెన్నూర్ బతుకమ్మ వాగు, కోటపల్లి మండలం పార్‌పల్లి, బోరంపల్లి, అర్జునగుట్ట ప్రాణహిత నది సరిహద్దు ప్రాంతాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. బోరంపల్లి గ్రామం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున గ్రామస్తులను పునరావాసకేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో అధికారులు మౌలిక సదుపాయలు కల్పించాలని సూచించారు. అనంతరం తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని ప్రాణహిత నదిని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు నిరసన సెగ

- ఎమ్మెల్యే ఇల్లు ముట్టడించిన వరద బాధితులు



ఎమ్మెల్యేను నిలదీస్తున్న బాధితులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో వరద బాధితుల నుంచి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు నిరసన సెగ తగిలింది. పట్టణంలోని రాంనగర్, బాలాజీ నగర్, డూప్లెక్స్‌లో నివాసం ఉంటున్న వరద బాధితులు శుక్రవారం రాంనగర్‌కు వచ్చిన ఎమ్మెల్యేను నిలదీశారు. ప్రతియేటా వరదలు వచ్చి ఇబ్బందులకు గురవుతున్నామని, డబ్బులు ఉన్న వారు వరదల సమయాల్లో తమకు నచ్చిన చోటుకు వెళ్లి ఉంటుండగా, లేని వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఏటా వరదలకు బలవుతున్నా ఆదుకోవడం లేదంటూ నిరసన తెలిపారు. అనంతరం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటిని రాంనగర్, బాలాజీనగర్ వరద బాధితులు ముట్టడించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఎమ్మెల్యే తనయుడు నడిపెల్లి విజిత్ రావు బాధితులతో మాట్లాడినా.. వారు వినకపోవడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. మూడేళ్లుగా వరదలు వస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని, రాళ్లవాగుకు కరకట్ట వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు ఇచ్చినట్లుగా తమకు ప్యాకేజీలు ఇచ్చి ఇతర చోట భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. వాగు ఒడ్డున ఇళ్లు ఎందుకు నిర్మించుకున్నారంటూ ఎమ్మెల్యే అనడంతో వారు మరింత ఆగ్రహం చెంది కొన్నేళ్లుగా తమ కాలనీకి వరదలు లేవని, మూడేళ్లుగానే ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. ఇళ్లు కట్టుకునేందుకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇస్తుండగా, ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గం ఏమి చేస్తుందంటూ నిలదీశారు. అసెంబ్లీలో చర్చిస్తానని చెప్పి బాధితులను అక్కడి నుంచి పంపించేశారు.

అండగా ఉంటాం..

ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్, పద్మశాలి కాలనీ ఏరియాల్లోకి వరద నీరు చేరిన, లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే దివాకర్‌రావు పరిశీలించారు. అండగా ఉంటామని వారికి భరోసానిచ్చారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు ప్రకాశ్ నాయక్, మెరుగు మహేశ్వరి పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు
- జిల్లాలోని వైద్య శిబిరాల పరిశీలన



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. అనంతరం జిల్లాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత, ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అనారోగ్య సమస్యలు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నంబరు : 7671001703లో సంప్రదించాలని తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ 24గంటలు వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందికి సెలవులు రద్దు చేశామని చెప్పారు. జిల్లాలో 21 ఆరోగ్య కేంద్రాల్లో ఎపిడమిక్ సెల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 27 వరద ప్రభావిత గ్రామాలను గుర్తించామని, హైరిస్క్ గ్రామాల నుంచి 17 మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలించామని అన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

ప్రజల ఆరోగ్యం విషయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కీటక జనిత వ్యాధులు, మలేరియా, డెంగ్యూ ప్రబలే అవకాశం ఉన్నందున చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, కాచి చల్లార్చి వడపోసిన మంచినీటిని తాగాలని అన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్

నస్పూర్: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. శుక్రవారం ఆయన విలేజ్ నస్పూర్‌లోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. గోదావరి నది పరీవాహక ప్రాంతంలో పంటపొలాలు సందర్శించారు. సీతారాంపల్లి గ్రామం వద్ద నస్పూర్ ఊర చెరువు మత్తడిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఇళ్ల యజమానులు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. నిర్వాసితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజల సౌకర్యార్థం మున్సిపల్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో 24 గంటల కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రమేశ్, తహసీల్దార్ జ్యోతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ సర్దుబాట్లు నిలిపివేయాలి


డీఈవోకు నోటీసు ఇస్తున్న సంఘ బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట టీచర్ల అక్రమ సర్దుబాటును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీటీఎఫ్, టీయూటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు ధర్నా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. అశాస్త్రీయ పద్ధతులను అనుసరించి సర్దుబాటు చేసిన విషయాన్ని ఇదివరకే డీఈవో దృష్టికి తెచ్చినట్లు పేర్కొనారు. ఈ నెల 5వ తేదీలోపు స్పందించి అక్రమ సర్దుబాట్లను నిలిపివేయాలని, లేనిపక్షంలో డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు, డీటీఎఫ్ అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పత్తి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బన్న రవీందర్ పాల్గొన్నారు.

కలుషితనీరు సరఫరా


కాలనీలకు సరఫరా అయిన కలుషిత నీరు

బెల్లంపల్లి: పట్టణంలోని శాంతిఖని ఇతర బస్తీల్లో శుక్రవారం సింగరేణి సరఫరా చేసిన తాగు నీరు మురికిగా వచ్చినట్లు కార్మికులు, కార్మికేతరులు తెలిపారు. ఫిల్టర్ బెడ్‌లో సరిగా క్లోరినేషన్, ఫిల్టర్ చేయకుండానే నీరు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకే ఈ దుస్థితి తలెత్తుతోందని మండిపడుతున్నారు. పూర్తిస్థాయిలో ఫిల్టర్ చేశాకే నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

వంతెనపై భారీ వాహనాలకు బ్రేక్


వంతెనపై బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూర్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిలో నిర్మించిన బతుకమ్మ వాగు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా మారడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భారీ వాహనల రాకపోకలు నిలిపివేసినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చెన్నూర్ నుంచి సిరోంచ, సిరోంచ నుంచి చెన్నూర్‌కు రాకపోకలు సాగించే భారీ వాహనాలు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సులు, చిన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని తెలిపారు. వాహనదారులు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

వరదార్పణం

- నీట మునిగిన 40వేల ఎకరాలు
- నిండా మునుగుతున్న రైతులు
- నష్టం మిగిల్చిన భారీ వర్షాలు
- పంటలు తేలాకే నష్టం అంచనా


చెన్నూర్ మండలం పొక్కూర్‌లో వరదలో మునిగిన పత్తి పంట

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎడతెరిపిలేని వానలు అన్నదాతలను కోలుకోకుండా చేశాయి. భారీ వర్షాలు అపార నష్టాన్ని మిగిల్చాయి. వేలాది ఎకరాల పంటలను నీట ముంచాయి. గోదావరి తీర ప్రాంతాలతోపాటు లోతట్టు ప్రాంతాల్లోని దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, జైపూర్, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో పత్తి, మిర్చి పంటలు నీటమునిగాయి. జిల్లాలో 40వేల ఎకరాల పంటలకు నష్టం వాటిల్లింది. కాళేశ్వరం, సుందిళ్ల, అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్ పంటలను ముంచెత్తింది. ప్రస్తుతం పంటలు నీట మునిగి ఉండగా నష్టం అంచనా వేయలేమని అధికారులు చెబుతున్నారు. పంటలు మురిగిపోవడం, పంటచేన్లలో ఇసుక మేటలు తదితర కారణాలతో దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేయనున్నట్లు తెలిపారు. నీరు బయటకు వెళ్లిన తర్వాత పంట మొలక యథావిధిగా ఉంటే నష్టం ఏమీ ఉండదని పేర్కొన్నారు. ప్రస్తుతం నష్టాన్ని ప్రాథమిక అంచనా కూడా వేయడం లేదు. విత్తనం వేసిన నుంచి ఇప్పటివరకు ఎకరా పత్తి పంటకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చు చేశారు. వరద నీటితో నిండిన చేలు, బురద, ఇసుక మేటలతో మునిగిన మొక్కలు, కోసుకుపోయిన పంట పొలాలు, మట్టి దిబ్బలతో సారం కోల్పోయిన చేన్ల పరిస్థితి చూసి రైతన్న గుండె తరుక్కుపోతోంది. రూ.10కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు రైతులు నష్టపోయారు. గుండెలవిసేలా రోదిస్తున్నారు. గోదావరి, ప్రాణహిత నదుల లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నాలుగు రోజులుగా వరదనీటిలోనే ఉన్నాయి. ఎదిగే దశలో ఉన్న పత్తి పంటతో పాటు వరి, కంది, పెసర పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పత్తి పంటకే అధిక నష్టం

జిల్లాలో వానాకాలంలో 3.63 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో పత్తి, వరి అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్నట్లు తెలిపారు. గతేడాది పత్తికి మంచి ధర ఉండగా రూ.వేలకువేలు కౌలు చెల్లించి రైతులు పత్తి సాగు చేశారు. ఈ ఏడాది పత్తి 1.90 లక్షల ఎకరాల్లో ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 2,60,054 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, ఇందులో పత్తి 1,55,295 ఎకరాల్లో, వరి 1,39,977 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా చాలా మంది రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్న సమయంలో ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురిశాయి. ప్రధానంగా 95 శాతం పత్తి పంటకే నష్టం వాటిల్లింది.

నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి

2020, 2021లో ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పంట పూత, కాత దశలో నష్టపోయారు. ఈ ఏడాది పంట ఎదిగే సమయంలో భారీ వర్షాలు దెబ్బతీశాయి. భారీ వర్షాలు, ప్రాణహిత నది ఉప్పొంగడం, కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో 2020లో 21వేల ఎకరాల్లో నష్టపోగా, 2021లో 32వేల ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు అధికారులు నివేదికలు అందజేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 34,400 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు గుర్తించారు. పరిహారం కోసం మూడేళ్లుగా ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురైంది. ఈ ఏడాది నాలుగోసారి 35వేల నుంచి 40వేల ఎకరాల పంటలను వరదలు మరోసారి దెబ్బతీశాయి.

గోదావరి తీరంలోనే అధిక నష్టం

జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 314 గ్రామాలకు చెందిన రైతులు సాగు చేసిన పత్తి, వరి నష్టం 35–40 వేల ఎకరాల వరకు ఉంటుంది. మొలక దశలో ఉన్న వరినార్లు నీటమునిగాయి. కోటపల్లి, చెన్నూర్, వేమనపల్లి, జైపూర్, దండేపల్లి, జన్నారం మండలాల్లో అధిక నష్టం వాటల్లింది. ప్రాణహిత, గోదావరి లోతట్టు ప్రాంతాల్లో వరద ఉధృతి కొనసాగుతూనే ఉండగా వరదలో ఇంకా మునిగి ఉన్నాయి. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపడితే ఈ నష్టం విలువ తెలిసే అవకాశముంది. ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు చెల్లించి కౌలుకు భూములు తీసుకున్న రైతుల పరిస్థితి మరీ దారుణం. కౌలుతోపాటు పెట్టిన పెట్టుబడి వరదపాలైందని కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గోదావరి ముంచుతోంది..!


పొక్కూరులో నీట మునిగిన పంట పొలాలు

చెన్నూర్‌రూరల్: ఎగువ కురిసిన వర్షాలకు మండలంలోని పొక్కూరు, నాగాపూర్, సుందరసాల, వెంకంపేట, చింతలపల్లి, నారాయణపూర్, బీరెల్లి తదితర గోదావరి పరీవాహక గ్రామాల్లోని పంటచేన్లు నీట మునిగాయి. అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో పంట పొలాలన్నీ నదులను తలపిస్తున్నాయి. ఏటా ఇదే పరిస్థితి తలెత్తుతోందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఈసారి కూడా వరదనీరు వస్తుందని భావించి ముందు జాగ్రత్తగా పొక్కూరు గ్రామంలోని లోతట్టు ప్రాంత వాసులు పునరావాస ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. గురువారం రాత్రి గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడిపారు. ప్రస్తుతం గోదావరి నిలకడగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు.


సుందరసాల నుంచి అన్నారం బ్యారేజీకి వెళ్లే రోడ్డుపై నిలిచిన వరద నీరు

తుంపెల్లి వాగులో ఇద్దరి గల్లంతు


ఘటన స్థలిలో వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ప్రత్యేకాధికారి, కలెక్టర్, ఎస్పీ

- కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్


కౌశిక్ (ఫైల్)


మోహన్ (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: తుంపెల్లి వాగులో ఇద్దరు గల్లంతయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుంపెల్లి గ్రామానికి చెందిన రేకుల దత్తు–మౌనిక దంపతుల చిన్న కుమారుడు కౌశిక్ (11) తన స్నేహితుడు ప్రణీత్‌తో కలిసి శుక్రవారం తుంపెల్లి వాగు వద్ద బ్రిడ్జి పక్కన గల బాట ప్రాంతానికి వెళ్లారు. కాళ్లకు బురద అంటగా కడుక్కునేందుకు వాగులోకి దిగారు. ఈ క్రమంలో కౌశిక్ కాలుజారి వాగులో పడిపోయాడు. గమనించిన ప్రణీత్ ఒడ్డుకు వచ్చి కేకలు వేశాడు. కాగా, సమీపంలో ఉన్న గూడెన్‌ఘాట్‌కు చెందిన యువకులు లింగేశ్, సుధాకర్, సాయి, తుంపెల్లికు చెందిన మోహన్ (40) వాగులో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఇందులో మోహన్ ఒడ్డుకు చేరుకునే ప్రయత్నంలో వాగునీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మోహన్ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తుండగా అతడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఇస్తారి, మెంగు ఉన్నారు. ఇద్దరు వాగులో గల్లంతు కాగా, అధికారులు రెస్క్యూటీం ద్వారా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. వాగుకు ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర గాలించినా వారి ఆచూకీ దొరకలేదు. సమాచారం తెలుసుకున్న జిల్లా ప్రత్యేకాధికారి హనుమంతారావు, కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌ఏల సస్పెన్షన్
తుంపెల్లి వాగులో ఇద్దరు గల్లంతైన నేపథ్యంలో వరద పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక విధులు నిర్వహించాల్సిన ముగ్గురు అధికారులు నిర్లక్ష్యం చేయడంతో వారిని సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పొంగుతున్న వాగులు, నదుల వద్ద ప్రజారక్షణ కోసం నియమించిన తుంపెల్లి పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఏతో పాటు జన్కాపూర్ వీఆర్ఏను ప్రకృతి వైపరిత్యాల నిర్వహణ చట్టం 2005 కింద సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం


నెన్నెల సవారీ బంగ్లాలో పీరీల వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నెన్నెల: కుల, మతాలకు అతీతంగా మొహర్రం పండుగను శనివారం జిల్లాలో జరుపుకోనున్నారు. మహ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రతీకగా ముస్లింలు మొహర్రం నిర్వహిస్తారు. పవిత్ర పోరులో అమరులైన ఇమామ్ హుస్సేన్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులందరికీ పది రోజులపాటు నివాళులర్పిస్తారు. మొహర్రం ఉత్సవాల్లో కులమతాలకు అతీతంగా పాల్గొంటారు. వేడుకల్లో భాగంగా హుస్సేన్, హుస్సేన్‌ల పేరిట గ్రామాల్లో కొలువుదీరే సవార్లను (పీరీలు) ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. పది రోజుల పాటు పూజలందుకున్న పీరీలను నేడు మొహర్రం సందర్భంగా నిమజ్జనం చేయనున్నారు. పీరీలను నమ్మే వారు మొహర్రం నెల వంక కనిపించిన నాటి నుంచి నిమజ్జనం జరిగే వరకు మద్యం, మాంసాహారానికి దూరంగా ఉంటారు. నిష్టగా ఉండి కటిక నేలపై నిద్రిస్తారు. పీరీలకు మలీద ముద్దలు, కుడకలు, బెల్లంషరబత్ నైవేద్యంగా సమర్పిస్తారు. సబ్జా ఆకులు, పూలు, కుడకుల దండలతో అలంకరిస్తారు. పీరీల వద్ద అగ్నిగుండం (అలావా) ఏర్పాటు చేసి దాని చుట్టూ కాళ్లకు గజ్జెలు కట్టుకొని డప్పుచప్పుళ్ల మధ్య లయబద్ధంగా అసైదులా ఆడుతారు.

బెల్లంపల్లి ఏరియాకు పూర్వవైభవం


అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): భవిష్యత్‌లో బెల్లంపల్లి ఏరియాకు పూర్వ వైభవం రానుందని ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ ధీమా వ్యక్తంజేశారు. గోలేటి టౌన్‌షిప్‌లో రూ.20లక్షలతో పునరుద్ధరించిన గెస్ట్ హౌస్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెస్ట్‌హౌస్‌లో అన్ని వసతులు కల్పించామని తెలిపారు. కొత్త గనుల ఏర్పాటుతో రాబోయే రోజుల్లో ఏరియాకు పూర్వ వైభవం రానుందని చెప్పారు. గోలేటి, మాదారం ఓసీపీలతో ఏరియా ఉత్పత్తిలో ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు. ఉత్పత్తికి అనుగుణంగా ఏరియాలో ఉద్యోగులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, పీవోలు సత్యనారాయణ, ఉమాకాంత్, డీజీఎంలు సతీశ్‌బాబు, ఉజ్వల్‌కుమార్ బెహారా, రామారావు, విజయ్‌సింగ్ ఇందా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం చిన్నమ్మనే హతమార్చాడు


చంద్రకళ (ఫైల్)


బెజ్జూర్: ఆస్తి కోసం ఓ కర్కోతకుడు చిన్నమ్మను హతమార్చాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గట్టు కేశగౌడ్–చంద్రకళ (55) దంపతులకు సంతానం లేదు. కేశగౌడ్‌కు కన్నెపల్లి మండలం తాళ్లరెబ్బెన గ్రామానికి చెందిన అతడి అన్న కొడుకు వెంకటేశ్వర్ గౌడ్‌తో 20 ఏళ్లుగా ఆస్తి తగాదాలున్నాయి. ఈక్రమంలో శుక్రవారం వెంకటేశ్వర్‌గౌడ్ బెజ్జూర్‌లోని కేశగౌడ్ ఇంటికి వచ్చి ఆస్తి వివరాలు అడిగాడు. కేశగౌడ్ వివరాలు చెప్పకపోవడంతో వెంకటేశ్వర్‌గౌడ్ వెంట తెచ్చుకున్న కత్తితో చిన్నమ్మ చంద్రకళపై దాడి చేశాడు. అడ్డుగా వెళ్లిన కేశగౌడ్‌పై కూడా దాడికి దిగాడు. కత్తి పోట్లతో తీవ్రంగా గాయపడ్డ చంద్రకళ అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలపాలైన కేశగౌడ్ తప్పించుకొని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కౌటాల సీఐ సాదిక్ పాషా ఆధ్వర్యంలో బెజ్జూర్ ఎస్సై విక్రం ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేశగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. కాగా, నిందితుడు వెంకటేశ్వర్‌గౌడ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

తల్లీకూతుళ్ల ఆచూకీ లభ్యం


కూతురు, మనవరాళ్లను రాజన్నకు అప్పగిస్తున్న ఎస్సై


తాండూర్: ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైన వివాహిత ఆచూకీ లభ్యమైంది. ఓ గ్రామస్తులు అందించిన సమాచారంతో తల్లీకూతుళ్లు క్షేమంగా ఇంటికి చేరారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొమ్మ లక్ష్మి, ఆమె ఇద్దరు కూతుళ్లు ఆధ్య, కీర్తన రెండు రోజులక్రితం అదృశ్యమైన విషయం తెలిసిందే. లక్ష్మి తండ్రి ముదిగిరి రాజన్న తన కూతురు, మనవరాళ్లు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బెల్లంపల్లి మండలం అకెనపల్లి గ్రామం నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా స్థానికులు గమనించి కొత్తపల్లి గ్రామానికి చెందిన కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఆ గ్రామానికి వెళ్లిన కుటుంబ సభ్యులు తల్లీకూతుళ్లను వెంట తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఎస్సై రాజశేఖర్ కౌన్సెలింగ్ ఇచ్చి లక్ష్మితోపాటు ఆమె కూతుళ్లను తండ్రి రాజన్నతో ఇంటికి పంపించారు.

ఏఎన్‌ఎంకు గాయాలు


గాయపడ్డ తారకమణి

కౌటాల: చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ హెల్త్ సబ్‌సెంటర్ ఏఎన్‌ఎం రాచకొండ తారకమణి కౌటాల నుంచి రవీంద్రనగర్‌కు శుక్రవారం స్కూటీపై విధులకు వెళ్తున్నారు. కౌటాల మండలం తలోడి గ్రామ సమీపంలో స్కూటీ ముందుటైరు పగిలిపోగా అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో ఆమె తల, ఛాతి, కుడి కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం స్థానికులు ఆమెను అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో విధులకు హాజరు కావాలనే ఉద్దేశంతో భారీ వర్షంలో వెళ్తూ తారకమణి ప్రమాదానికి గురైనట్లు తోటి ఏఎన్‌ఎంలు తెలిపారు.

గోదావరికి పోటెత్తుతున్న వరద


ఎల్లంపల్లి గేట్ల నుంచి గోదావరిలోకి వెళ్తున్న నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో పాటు కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి భారీగా వరదనీరు ఎల్లంపల్లికి చేరుతోంది. ప్రాజెక్టుకు వచ్చి చేరుతున్న నీటి పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులు ప్రాజెక్టులోని 47 గేట్లను ఎత్తి 7 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిమట్టం గంటగంటకూ పెరుగుతుండగా శుక్రవారం రాత్రి వరకు పరిస్థితి ఇలా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటి మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా 145.37 మీటర్లకు చేరింది. 20.175 టీఎంసీలకు గాను 13.470 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద ఎగువ ప్రాంతాల నుంచి 3.64 లక్షల క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ నుంచి 2.33 లక్షల క్యూసెక్కులు, కడెం నుంచి 48 వేల క్యూసెక్కుల నీటి రాకతో మొత్తంగా 6.50 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతోంది. అవుట్ ఫ్లో 7 లక్షల క్యూసెక్కులు ఉండగా ఇందులో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 275 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్ట్‌లోని 47 గేట్లు ఎత్తి 7లక్షల క్యూసెక్కుల వరదనీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. దీంతో గోదావరి ఉధృతి అధికంగా ఉండడంతో దిగువ ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. మంచిర్యాల రూరల్ సీఐ తోట సంజీవ్, ఎస్సై నరేశ్‌కుమార్ ప్రాజెక్ట్ వద్ద బందోబస్తు ఏర్పాట్లు సమీక్షిస్తూ ప్రాజెక్టుపై ఎలాంటి రాకపోకలు జరగకుండా చూస్తున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

శ్రీరాంపూర్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ హరినారాయణ గుప్తా సూచించారు. శుక్రవారం ఎస్సార్పీ–1 గనిపై 'నా భద్రత–నాబాధ్యత, నాభద్రతే–నా కుటుంబ భద్రత' అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఉద్యోగి వ్యక్తిగత భద్రతతో పని చేస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చన్నారు. రక్షణ చర్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పనిలో తొందరపాటు ఏమాత్రం పనికిరాదని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏజెంట్ గోపాల్‌సింగ్, మేనేజర్ విజయ్‌కుమార్, సేఫ్టీ అధికారి రమేశ్ బాబు, టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, జీఎం చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, పిట్ సెక్రటరీ ఎంబడి తిరుపతి, పిట్ ఇంజినీర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం


కెన్నడీ


వెంకటేశ్

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (1630/1982) కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా శ్రీరాంపూర్‌కు చెందిన వీ కెన్నడీ, సంయుక్త కార్యదర్శిగా బాదం వెంకటేశ్‌ను నియమించారు. ఈమేరకు కేంద్ర అధ్యక్షుడు యాట ఓదెలు, వర్కింగ్ ప్రెసిడెంట్ జీ లింగమూర్తి శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ సంజీవరెడ్డిని జీఎం కార్యాలయంలో కలిసి నూతనంగా నియమితులైన ఇరువురిని పరిచయం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ డెప్యూటీ ప్రధానకార్యదర్శి దామోదర్ ప్రసాద్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎస్.కుమార్, నాయకులు పెర్క సత్యనారాయణ, కంబాల నాగయ్య, దాసరి సంపత్, సురేశ్, చిట్యాల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తగ్గని వరద ఉధృతి


హనుమాన్ ఆలయం వరకు వచ్చిన వరదనీరు

చెన్నూర్: గోదావరి ఉధృతి పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టలేదు. గురువారం రాత్రి గోవరమ్మ ఆలయం వరకు వచ్చిన నదీ ప్రవాహం శుక్రవారం కొంత వెనక్కి వెళ్లి హనుమాన్ ఆలయం వరకు చేరింది. పరీవాహక ప్రాంతంలోని పంటచేన్లు జలమయమయ్యాయి. సుమారు 300 ఎకరాల పంటలు నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్వతి బ్యారేజీ 74గేట్ల ఎత్తివేత
జైపూర్: మండలంలోని రొమ్మిపూర్ సమీపంలోగల పార్వతి (సుందిళ్ల) బ్యారేజీ మొత్తం 74గేట్లు ఎత్తి శుక్రవారం దిగువకు నీటిని వదిలిపెట్టారు. గోదావరినదిలో నీటి ప్రవాహం ఎక్కువ కావడం, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి వరద పోటెత్తడంతో పార్వతి బ్యారేజీలోకి భారీగా వరదనీరు చేరింది. బ్యారేజీ మొత్తం 74గేట్లు ఎత్తి 8.34లక్షల క్యూసెక్కుల నీటిని అన్నారం బ్యారేజీలోకి వదిలారు. గంటగంటకూ గోదావరినదిలోకి నీటి ప్రవాహం పెరిగిపోవడంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి వచ్చే నీటిని దిగువకు వదిలిపెట్టారు.


పార్వతి బ్యారేజీకి పోటెత్తిన వరదనీరు

పవర్‌ప్లాంట్ కార్మికుడికి తీవ్ర అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌చందు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్న దుస్స పవన్‌చందు గురువారం రాత్రి విధులు నిర్వర్తిస్తున్న ఏరియాలోనే తీవ్ర అస్వస్థతకు గురికాగా సిబ్బంది మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న పవర్ మేక్ కంపెనీకి సబ్‌గా పని చేస్తున్న ఏఆర్‌సీలో పవన్ చందు ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బాయిలర్ ఏరియాలో మిల్లర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అతడు ఆ మిల్లర్ నుంచి రిజెక్ట్ కోల్ ద్వారా వెలువడే విషవాయువులను పీల్చడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. హుటాహుటిన అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, రిజెక్ట్ కోల్ వచ్చే ఏరియాలో మిల్లర్ ఆపరేట్‌గా పని చేస్తున్న కార్మికుడికి ఏ ఒక్క పరికరం రక్షణగా ఇవ్వనందునే అతడు అస్వస్థతకు గురైనట్లు స్థానిక యూనియన్ నాయకులు ఆరోపించారు.

బెల్లంపల్లి కాంగ్రెస్‌లో పదవుల కొట్లాట


మాట్లాడుతున్న పీఎస్సార్ వర్గీయులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌లో పదవుల కొట్లాట ఆరంభమైంది. రాష్ట్ర మాజీ మంత్రి గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులుగా ముఖ్య నాయకులు విడిపోయి రచ్చకెక్కారు. ప్రస్తుతం వినోద్‌వర్గీయులకు టీపీసీసీ వైస్ చైర్మన్ మల్లు రవి నుంచి పార్టీ మండలాధ్యక్ష పదవులు వరించగా ఆ నియామకాలు చెల్లవని ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు వ్యతిరేకిస్తున్నారు. శుక్రవారం పార్టీ పట్టణ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వినోద్‌ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగా ప్రకటించిన మండలాధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి ప్రభాకర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, డీసీసీ ఉపాధ్యక్షుడు తొంగల మల్లేశ్, నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి, పార్టీ మండలాధ్యక్షులు బాకం మల్లేశ్, వేముల కృష్ణ, సూరం దామోదర్‌రెడ్డి, బెల్లంపల్లి పట్టణాధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, నాయకుడు సిలివేరి సత్యనారాయణ తదితరులు పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుల నియామకాలు చెల్లవని, ఆ ఉత్తర్వులు ఉత్తవేనని కొట్టి పారేశారు. ఓ వర్గం నాయకులు నియామక పత్రాలు అందుకోగా, మరోవైపు ఇంకో వర్గం నాయకులు ఆ పదవులు చెల్లుబాటు కావని వ్యతిరేకించడంతో పార్టీలో కుమ్ములాటలు మరోసారి బహిర్గతమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ రెండు వర్గాలుగా చీలిపోవడంతో కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు.